క్లుప్తంగా

ముత్యాలమ్మకు స్వర్ణ కిరీటం సమర్పణ


అమ్మవారికి స్వర్ణ కిరీటం అలంకరణ

ఉండ్రాజవరం: ముత్యాలమ్మ జాతర మహోత్సవాలల్లో భాగంగా కె.సావరం లో ముత్యాలమ్మ వారిని శుక్రవారం స్వర్ణ కిరీటంతో అలంకరించారు. సుమారు 650 గ్రాముల బంగారంతో తయారు చేసిన స్వర్ణ కిరీటాన్ని అలంకరించి గ్రామంలోని ఊరేగించారు. కె.సావరం గ్రామ ప్రజలతో పాటు టి.వేమవరం, జంగంచెరువు గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పెరవలి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మల్లేశ్వరం ఫీడర్‌పై ఉన్న అన్నవరప్పాడు, కడింపాడు, మల్లేశ్వరం గ్రామాల్లో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఇస్తారన్నారు.

దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

దేవరపల్లి: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని యర్నగూడెం గ్రామ పంచాయతీ కార్మికులకు, వార్డు సభ్యులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ బొంతా భరత్ బాబు, కార్యదర్శి అమ్మిరాజు చేతుల మీదుగా 16 మంది కార్మికులు, 14 మంది వార్డు సభ్యులకు పంచాయతీ కార్యాలయం వద్ద నూతన వస్త్రాలు అందజేశారు. ఏటా సంక్రాంతికి కార్మికులు, వార్డు సభ్యులకు నూతన వస్త్రాలు అందజేస్తున్నట్టు సర్పంచ్ భరత్‌బాబు తెలిపారు. కార్మికులకు, వార్డు సభ్యులకు, సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన


సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పట్టణాభివృద్ధే లక్ష్యంగా పట్టణంలో వివిధ పనులను చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. స్థానిక 27వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, డీఈఈ సత్యనారాయణ, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, కొవ్వాడ బాలు బాలాజీ, గంగుల గోపియాదవ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

12 నుంచి గ్లోరియస్ బైబిల్ కాన్ఫరెన్స్

నిడదవోలు రూరల్: పురుషోత్తపల్లి గ్రామంలో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకూ గ్లోరియస్ బైబిల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు కల్వరి క్రైస్ట్ గోస్పల్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కల్వరి గ్లోరియస్ బిల్డింగ్‌లో జరిగే ఈ కార్యక్రమాల్లో దైవజనులు కిరణ్‌పాల్, మోజేస్‌బాబు, ప్రవీణ్ పగడాల, సురేంద్ర మోజేస్, నరేంద్రకుమార్, గాబ్రియేలు, దానియేలు ప్రసంగిస్తారన్నారు.

పోలీసులు, పాత్రికేయులకు క్రికెట్ పోటీలు

గోపాలపురం: వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి సందర్భంగా ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో భాగంగా శుక్రవారం పోలీసులకు పాత్రికేయులకు మధ్య క్రికెట్ పోటీలు జరిగాయి. దీనికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఎల్లప్పుడూ వృత్తిలో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి పనిచేస్తున్న పోలీసులు, పాత్రికేయులకు క్రికెట్ పోటీలు ఆటవిడుపుగా ఉంటాయని ఎమ్మెల్యే అన్నారు. దేవరపల్లి సీఐ బి.నాగేశ్వర్ నాయక్, గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్, గోపాలపురం, దేవరపల్లి మండలాల పోలీసులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

వీరవల్లిలో రీ సర్వే


నల్లజర్ల: ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా వీరవల్లి గ్రామాన్ని ఎంపిక చేసినట్టు డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ తెలిపారు. ఇందులో భాగంగా గురు, శుక్రవారాల్లో గ్రామ సరిహద్దులు ఏర్పాటు చేశామన్నారు.

ఉప్పరగూడెంలో పారిశుధ్య డ్రైవ్

గోపాలపురం: స్థానిక ఉప్పరగూడెంలో ఓ బాలుడికి డెంగీ సోకి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. డెంగీ కేసు నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. గత రెండు రోజులుగా ఉప్పరగూడెంలో సంపూర్ణ పారిశుధ్య డ్రైవ్ చేపట్టినట్లు గ్రామ కార్యదర్శి కె.అనురాధ శుక్రవారం తెలిపారు. తాగునీటి శాంపిల్స్ ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు.

పుంజుకుంటున్నాయ్..


పూల కోడి


తాళ్లపూడిలో తలపడుతున్న పందెం కోళ్లు

- పందేలకు సై అంటున్న కోళ్లు
- ప్రత్యేక ఆహారం పెట్టి పెంపకం
- బరులు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

తాళ్లపూడి: పందెం కోడి సై అంటోంది... సంప్రదాయ ముసుగులో జరిగే సంక్రాంతి సంబరాల్లో కోడి పందేలకు రెడీ అయ్యింది.. ఒకపక్క పందేలకు నిర్వాహకులు బరులను సిద్ధం చేస్తుండగా, మరో పక్క అధికారులు అనుమతులు లేవంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఏటా కోడి పందేలు యథేచ్ఛగా సాగిపోతున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో అనేక బరులు సిద్ధమవుతుండగా, తాళ్లపూడి మండలంలోని గతేడాది జరిగిన అన్ని చోట్లా ఇప్పుడు మళ్లీ పందేలకు బరులు సిద్ధం చేస్తున్నారు. పందెం కోడి పుంజులకు రాజభోగాలతో మేత పెట్టి మరీ పందేలకు సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామంలో చూసినా కోడి కూతే వినిపిస్తోంది. ఇక్కడ సుమారు 3 వేల నుంచి నాలుగు వేల వరకూ పందెం కోళ్లను పెంచుతున్నట్లు సమాచారం. పందెంలో తలపడే పుంజులకు కల్పిస్తున్న సకల సౌకర్యాలు చూస్తే ముక్కున వేలేసుకోక తప్పదు. సంక్రాంతికి మూడు నెలల ముందు నుంచే ప్రత్యేకంగా పందెం కోళ్లను సిద్ధం చేసే పనిలో పెంపకందారులు ఉన్నారు. కసరత్తులు చేయించి కండలు పెంచి పౌరుషాన్ని నింపుతున్నారు. ఇలా సంక్రాంతి బరిలోకి దింసేందుకు సిద్ధమవుతున్నారు.

పెంపకం... ప్రత్యేకం

మంచిజాతి కోళ్లను ఎంపిక చేసి పెంపకందారులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పుంజులను పందేలకు సిద్ధం చేయడమంటే మాములు విషయం కాదు. ఇదోక కళ. నిష్ణాతులైన వ్యక్తులు మాత్రమే శిక్షణ ఇవ్వగలరు. ఉదయాన్నే కాలువలు, చెరువుల్లో ఈత కొట్టించడం, రెండు గంటలు ఎండలో ఉంచడం ద్వారా పందెంలో ఆయాస పడకుండా ఉంటాయి. కోడిగుడ్డు, 40 గ్రాముల వరకూ వేట మాంసం, మధ్యాహ్నం బాదం, పిస్తా పప్పులు, సాయంత్రం రాగులు ఆహారంగా పెడతారు. ఒక్కో పుంజుకు ఖర్చు నెలకు రూ.2 వేల పైమాటే అవుతోంది. రోజూ చోళ్లు, గంట్లతోపాటు ఉడకబెట్టిన గుడ్డును తినిపిస్తారు. అంతేకాకుండా అదనపు బలం కోసం కోళ్లకు టాబ్లెట్లను వేస్తున్నట్టు పెంకందారులు చెబుతున్నారు.

రూ. వేలల్లో ధరలు

కోడి పుంజుల పెంపకం నేడు వ్యాపారంగా మారింది. ఐరన్ మెస్‌లు పెట్టి ప్రత్యేకంగా పెంచుతున్నారు. ఏడాది పొడవునా పెంచిన వాటిని నెల ముందు పండగ సమయంలోనే పందెం రాయుళ్లు కొనుగోలు చేస్తారు. డిమాండ్‌ను బట్టి ఎంత ధరైనా చెల్లిస్తారు. ప్రస్తుతం కోడిపుంజు ధర రూ. 4 వేల నుంచి రూ.10 వేల పైన రూ.30 వేల వరకూ సైజును బట్టి విక్రయిస్తున్నారు. ఏడాది పొడవునా పెంచినా బరిలో దిగిన కోడిపుంజు కొద్ది నిమిషాలు మాత్రమే ఉంటుంది. పందెం రాయుళ్లు ఎదురుచూస్తున్న సమయం దగ్గరకొస్తుంది. బెట్టింగ్‌లు రూ.లక్షల్లో కాస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పందేలు జరగకుండా అడ్డుకుంటామని పోలీసులు చెబుతున్నారు. తహసీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులు ఎక్కడా బరులు వేయకుండా చూస్తామని ప్రకటనలు చేస్తున్నారు. నిర్వాహకులు మాత్రం బరులను సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

కోళ్ల జాతులెన్నో..

పందెం పుంజులను జాతుల బట్టి వివిధ పేర్లతో పిలుస్తారు. పచ్చకాకి, అబ్రాసు, పింగళ, సేతువా, కాకిపుంజు, తితువా, కొక్కిరాయి, గేరువా, డేగ, మైలా, పూల, నెమలి, కాకి నెమలి, పెట్టమారు తదితర జాతి పుంజులను ఎక్కువగా పెంచుతుంటారు. ఇవి విసిరే కత్తి పోటుకు మదించిన పుంజైనా నేలవాల్సిందే అంటున్నారు. మొత్తం తెల్లటి ఈకలతో ఉండే సేతువా రాత్రి పందేల్లో రారాజు. వెన్నెల్లో దీనికి ఎదురే ఉండదు. ప్రత్యర్థికి చెందిన పచ్చకాకి పుంజు బరిలోకి దిగితే స్వపక్షం సైతం ఎదుటివారి వైపు వెళ్లాల్సిందే. అక్కడక్కడా కనిపించే పెట్టమారుపుంజు బరిలోకి కనిపిస్తే దాని పోరాటం చూసేందుకు జనం ఎగబడతారని నాటితరం పందెంరాయుళ్లు అంటున్నారు. శరీరం నెత్తురోడుతూ కొనఊపిరి ఉన్నంత వరకూ పోరాడి గెలుపు తనదేననిపిస్తుంది. కాకిపుంజు ప్రతాపం మునిమాపు వేళలోనే చూడాలని ఆ సమయంలో దీని బలం మరింత రెట్టింపు అవుతుందంటున్నారు. ఈ సమయంలో బరిలోకి దిగితే ఎదుట ఉన్న కోడి ఎటువంటిదైనా నేల కూలాల్సిందేనని చెబుతున్నారు. కోడి పుంజుల్లో జాతులు, వాటి జాతకాలు చూసే వారున్నారు. దీనికి ప్రత్యేకంగా కుక్కుటశాస్త్రం ఉంది. కోడి జాతిని బట్టి ఏదిక్కుకు ఏ సమయంలో వెళ్లాలి, ఏ నక్షత్రం, ఏ ముహూర్తంలో వెళ్లాలనేది చూసుకుని తమ కోడి పుంజులను బరిలోకి దింపుతారు.


పచ్చకాకి పుంజు


రాత్రి పందేల రారాజు సేతువా


రసంగి

సంప్రదాయాలకు అద్దం పట్టేలా..

నిడదవోలు: మన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టెలా సంక్రాంతి పండగ జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి అన్నారు. స్థానిక చర్చిపేటలో కోడి పందేలకు వ్యతిరేకంగా శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ పండగ ముసుగులో నిర్వహించే కోడి పందేలను వ్యతిరేకించి సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పట్టణ ఏఎస్సై పరమహంస, సచివాలయ అడ్మిన్ కె.చందు, జువ్వల రాంబాబు, ఉల్లూరి సూరిబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

కొవ్వూరు: స్థానిక సద్గురు ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాల ప్రాంగణంలో రంగవల్లులు తీర్చిదిద్దారు. బొమ్మల కొలువు, గంగిరెద్దులు, కోడి పుంజులు బొమ్మలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ పాలెంపాటి వెంకటరత్నం, చైర్మన్ కంతమణి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ కంతమణి కీర్తిశ్రీ పాల్గొన్నారు.


కొవ్వూరు సద్గురు హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తూ..

అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు

కొవ్వూరు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయవద్దని ఆర్డీఓ రాణి సుస్మిత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం డివిజనల్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసు నమోదు సమయంలో కచ్చితంగా నిజనిర్ధారణ చేసుకోవాలని, అమాయకులైన ఏ ఒక్కరిపై కేసు నమోదు కాకుండా శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత పోలీసు అధికారులదే అని అన్నారు. పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, డివిజన్ పరిధిలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

- ఇసుక సరఫరాలో ఏవిధమైన ఇబ్బందుల్లేకుండా సక్రమంగా అందించాలని ఆర్డీఓ రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు శివారున ఉన్న ఎరినమ్మ బోట్స్ మెన్ ఇసుక ర్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఇసుక బిల్లులు చేసే విధానం, రవాణా గురించి ఆమె ఆరా తీశారు. డిసెంబర్ 31వ తేదీతో ఈ ర్యాంపునకు నిర్దేశించిన క్వాంటిటీ పూర్తి కావడంతో మళ్లీ రెన్యూవల్ చేసినట్లు ఆర్డీఓ ప్రకటించారు.


కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రాణి సుస్మిత

షాదీఖానా పరిశీలన

నిడదవోలు రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీఓ రాణి సుస్మిత సూచించారు. సమిశ్రగూడెంలో షాదీఖానాను ఆమె పరిశీలించారు. షాదీఖానాకు సంబంధించి కొన్నేళ్లుగా ఉన్న వివాదాన్ని పరిష్కరించాలని పీజీఆర్ఎస్‌లో స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆమె క్షేత్రస్థాయిలో విచారించారు. త్వరితగతిన ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు.

చెరకు సాగుకు ప్రోత్సాహకాలు

చాగల్లు: జిల్లాలో చెరకు సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యాల సహకారంతో అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారని డిప్యూటీ కేన్ కమిషనర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. చాగల్లులో చెరకు అభివృద్ధి మండలి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2010 వరకు క్రషింగ్ సీజనల్‌లో 14,830 హెక్టార్లలో ఉండే చెరకు ప్రస్తుతం 2,400 హెక్టార్లకు పడిపోయిందన్నారు. దీంతో జిల్లాలోని తణుకు ఆంధ్రా షుగర్స్, భీమడోలు, చాగల్లు షుగర్ ఫ్యాక్టరీలో మూతపడగా వచ్చే క్రసింగ్ సీజన్ నుంచి తాడువాయి ఫ్యాక్టరీలో చెరకు విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల ఫ్యాక్టరీ నడిపే స్థితిలో లేమని ప్రభుత్వానికి తెలియజేసినట్లు చెప్పారు. రైతులు పంట మార్పిడికి అవకాశం కలిగే విధంగా షుగర్ ఫ్యాక్టరీలను ప్రోత్సహించే విధంగా ఉమ్మడి పశ్చిమగోదావరి, ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లాలలోని చెరకు ఫ్యాక్టరీల పరిధిలోని చెరకు జోన్‌లను ఉయ్యూరు కేసీపీ షుగర్ ఫ్యాక్టరీకి కేటాయించినట్లు చెప్పారు. కేసీపీ షుగర్స్‌కి చెరకు రవాణా చేసే రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని ఆయన చెప్పారు. రైతులు గతంలో మాదిరిగా చెరకు సాగు చేసి కేసీపీ షుగర్స్ చెరకు పంపించి సహకరించాలని కోరారు. ఉయ్యూరు కేసీపీ షుగర్స్ టన్నుకి రూ.3,876 చెల్లిస్తుందని ఫ్యాక్టరీ డీజీఎం కేన్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఫ్యాక్టరీ చెరకు రవాణా చేసిన రెండు వారాల్లోపు నగదు చెల్లిస్తామన్నారు. రోజుకు 8,500 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ఫ్యాక్టరీ పనిచేస్తోందని ఆయన తెలిపారు.


చాగల్లులో మాట్లాడుతున్న డిప్యూటీ కేన్ కమిషనర్ సత్యనారాయణ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పెరవలి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తెలిపారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయటం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ డి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో బాలికలపై జరుగుతున్న అకృత్యాలపై ప్రతి ఒక్కరూ స్పందించాలని, దీనికి పాల్పడిన వారికి కఠిన శిక్షలు ఉంటాయన్నారు. బాలికల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప్, పశువైద్యాధికారి సల్మా, ఆరోగ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

ఉచిత వైద్య శిబిరం

నిడదవోలు: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో రాజమహేంద్రవరం శ్రీభాను తేజాస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, శ్రీరమా దంత వైద్యశాలకు చెందిన వైద్యులు 52 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు ఎం.హరిభాను, బేబి, ఎల్.పవన్‌కుమార్, కుందుల ప్రభాకరం, ఎంవీ రమణ, లక్కు తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏటిగట్టు వద్ద చెట్లకు నిప్పు


తాళ్లపూడి పోలీస్ స్టేషన్ సమీపంలో కాలిపోతున్న చెట్లు

తాళ్లపూడి: స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమీపంలో గోదావరి ఏటిగట్టు వద్ద తాటిచెట్ల కింద తుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో ఆ ప్రాంతంలోని చెట్లు కాలిపోయాయి. అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పీడబ్ల్యూ పరిధిలోని చెట్లను కొందరు నరికి వేస్తున్నారు.

వాహనాల సీజ్

గోపాలపురం: చెరుకుమిల్లి గ్రామంలో పోలవరం కుడి ప్రధాన కాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం రెవెన్యూ అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా జేసీబీ, రెండు లారీలను పట్టుకున్నట్లు తహసీల్దార్ కె.అజయ్‌బాబు తెలిపారు. వాటి యజమానులకు అపరాధ రుసుం విధించామన్నారు. మట్టిని అక్రమంగా తరలిస్తే తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కిశోరి వికాసంపై అవగాహన

నల్లజర్ల: గ్రామాల్లోని 11 నుంచి 19 ఏళ్లలోపు బాలికల సంరక్షణలో భాగంగా కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ సింహాద్రి తెలిపారు. మండల స్థాయి అధికారులకు శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం, ఆరోగ్యం,యోగా, బాల్యవివాహాల నివారణ, ఆత్మరక్షణ, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం, జీవనోపాధి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేవిధంగా సంబంధిత అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, సీఐ శ్రీనివాస్, ఎంఈఓలు సత్యనారాయణ, భగవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, కృష్ణవేణి, హారతి, మహిళ సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గోవిందా.. గోవిందా..

- శ్రీవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వారం ద్వారా స్వామి దర్శనం


యర్నగూడెంలో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి


కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో సుందర గోవిందుడు

దేవరపల్లి: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీవారి ఆలయాలు శుక్రవారం గోవింద నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాత సేవ అనంతరం భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకున్నారు. దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, యర్నగూడెం అలివేలుమంగా పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం, గౌరీపట్నం శ్రీపర్వతంపై వేంకటేశ్వరస్వామి, లక్ష్మీపురం హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. దేవరపల్లి షిర్డీ సాయి మందిరంలో కూడా వేంకటేశ్వరస్వామి అలంకరణలో సాయినాథుడు భక్తులకు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు.

నిడదవోలు: పట్టణంలోని రుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మిలు స్వామివారికి పూజలు చేశారు. స్థానిక గ్రామ దేవత శ్రీనంగాలమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కొవ్వూరు: స్థానిక బసివిరెడ్డిపేట వేంకటేశ్వరుని ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకుడు దేవగుప్తాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అవంతీ ఫీడ్స్ అధినేత అల్లూరి ఇంద్రకుమార్ స్వామి వారిని దర్శించుకున్నారు. పాతూరులోని గోపాలస్వామి ఆలయం, బసివిరెడ్డి పేటలో వేంకటేశ్వరస్వామి ఆలయం, వేగివారి చావిడి వద్ద చిన్న వెంకటేశ్వరస్వామి, శ్రీనివాసపురం ఆలయంలోను ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్శనం కోసం రెండు గంటలు వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదారం చేశారు. సుమారు 8 వేల మంది స్వామిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

ముక్కోటి పూజలు

చాగల్లు: స్థానిక మెయిన్ రోడ్డులోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శెట్టిబలిజ సీతారామస్వామి ఆలయంలో సప్తాహ మహోత్సవాలు జరిగాయి. శ్రీరామనామ ధ్యాన భజనా నామ సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. పాటమ్మపేటలోని వేణుగోపాలస్వామి ఆలయం, బ్రాహ్మణగూడెం రామాలయం, ఊనగట్ల, కలవలపల్లి, మార్కొండపాడు గ్రామాల్లోని ఆలయాల్లో ముక్కోటి పూజలు నిర్వహించారు.

నిడదవోలు రూరల్: మునిపల్లిలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని చామంతి పూలతో అలంకరించారు. అర్చకుడు రామకృష్ణాచార్యులు, ఆలయ ఈఓ నామాల శివ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


దేవరపల్లి వెంకన్న ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు


అన్నవరప్పాడులో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఘనంగా శ్రీనివాస కల్యాణం

నల్లజర్ల: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పోతినీడుపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆలపాటి కరుణాకర్ దంపతుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం జరిగింది. ముద్దాపురానికి చెందిన ముళ్లాంబిక భజన మండలి ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. దీనికి మాజీ హోం మంత్రి తానేటి వనిత హాజరై స్వామివారిని దర్శించుకుని పూజాధికాలు నిర్వహించారు. మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, బంక అప్పారావు, చావాగోఖుల్, పోతవరం సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ముప్పిడి వెంకటరత్నం, అందుగుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాస కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి తానేటి వనిత

10వ తరగతి సర్టిఫికెట్స్ పోయినవి

గంద్రోతు వీరవెంకట సత్యనారాయణ S/o పద్మాజీరావు గోపాలపురం మండలం భీమోలు నివాశిని నా S.S.C. 2015-2016 సం॥ పూర్తి అయినది. నా S.S.C.Roll No.1611125817 నా సర్టిఫికెట్ మా ఇంటి నుండి గోపాలపురం జిరాక్స్ తీయించడానికి పటికెళ్ళగా దారిలో పడిపోయినవి. దొరికిన వారు దయతో 63026 95131 ఈ నెంబరుకి తెలుపగలరు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com